E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారిగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :237 గురువారం 06 ఆగస్టు 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-



# ఏపీ ఎజెండా

## తెలంగాణ ఆందోళన

- జీఆర్ఎంబీ ఎజెండాపై హరీశ్ ఫైర్
- రేవంత్ మౌనం ఎందుకని ప్రశ్న
- ఏపీ కుట్రలకు కాంగ్రెస్ సహకారమా?
- ఏడు ప్రాజెక్టులపై రద్దు కుట్ర
- తెలంగాణ హక్కులపై దాడి: హరీశ్
- 'గురుదక్షిణ' కోసమే మౌనమా?
- బీజేపీ వెంటనే స్పందించాలి
- ప్రాజెక్టుల రద్దు అంటే రాష్ట్రానికే నష్టం
- పోరాటానికి సిద్ధం: బీఆర్ఎస్ హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ద్రోహం తలపెట్టాలని చూస్తే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టు అనుమతులపై పక్క రాష్ట్రం కుట్రలు చేస్తుంటే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహిస్తూ రాష్ట్ర ప్రయోజనాలకు ఉరివేస్తోందని ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18న జరగబోయే గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాను చూస్తే అది కేవలం ఏపీ కోసమే జరుగుతున్నట్లు అనిపిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిపై సాధించిన ఏడు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తే, వాటిని జీఆర్ఎంబీ తన ఎజెండాలో చేర్చడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

## తెలంగాణ అభివృద్ధి అజెండాతో

# ఢిల్లీలో కీలక భేటీలు

### సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రులను కలిసిన వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య


**తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ, ఆగస్టు 5**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పలు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ భేటీల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య కూడా పాల్గొన్నారు.

ముందుగా కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి కలిశారు. అనంతరం కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో సమావేశమై తెలంగాణకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య, ఇతర ఎంపీలు, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులు, అటవీ సంరక్షణ, ప్రజా ప్రయోజనాల అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు.ప్రత్యేకంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లకు పెంచేందుకు మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని ఈ సమావేశాల్లో కోరినట్లు తెలిపారు.



## లోన్‌దారులకు ఆర్‌బీఐ గుడ్‌న్యూస్



2 లో

- రెపో రేటును 5.25 శాతానికే పరిమితం చేసిన ఆర్‌బీఐ
- హోమ్, ఆటో, పర్సనల్ లోన్ల ఈఎంఐలకు ఊరట
- ఎంపీసీ ద్వైమాసిక సమీక్షలో కీలక నిర్ణయం
- న్యూట్రల్ విధానాన్ని కొనసాగిస్తున్న ఆర్‌బీఐ
- ద్రవ్యోల్బణం, వృద్ధిని దృష్టిలో ఉంచుకున్న నిర్ణయం
- భౌగోళిక ఉద్రిక్తతల మధ్య స్థిరత్వానికే ప్రాధాన్యం

## జంతర్ మంతర్ నిరసనల్లో టెర్రరిస్టులు

- ఐఎస్ఐ కుట్ర భగ్నం
- తొమ్మిది మంది అరెస్ట్
- జంతర్‌మంతర్ లక్ష్యంగా కుట్ర
- పెట్రోల్ బాంబుల స్వాధీనం
- నలుగురు మైనర్లు అదుపులో
- విదేశీ ఫండింగ్‌పై దర్యాప్తు



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** పంజాబ్ పోలీసులు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కుట్రను భగ్నం చేస్తూ ఓ భారీ ఉగ్ర నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఐఎస్ఐ ఆదేశాలతో దేశంలో ఉగ్ర దాడులకు ప్లాన్ చేస్తున్నారనే ఆరోపణలతో అమృత్‌సర్ పోలీసులు ఇద్దరు వేర్వేరు ముఠాలకు చెందిన తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో నలుగురు మైనర్లు ఉండటం గమనార్హం. పోలీసుల కథనం ప్రకారం.. ఈ అనుమానితుల నుంచి పెట్రోల్ బాంబులు (బోటిల్ బాంబులు), పిస్టళ్లు, సజీవ తులసి గుండ్లు (కార్ట్రిడ్జు), లైటర్లు, ఇతర అనుమానాస్పద పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ నెట్‌వర్క్ మూలాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వరకు విస్తరించినట్లు విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టయిన వారిలో ఒకడు తన సహచరులతో కలిసి జంతర్ మంతర్ వద్దకు వెళ్లాడని, అక్కడ కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఉగ్ర దాడికి కుట్ర పన్నినట్లు తేలింది.వీరికి ఉత్తరప్రదేశ్ నివాసి ఒకరి ద్వారా ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమకూర్చడానికి ఐఎస్ఐ హ్యాండ్లర్లు ప్రయత్నించినప్పటికీ, భద్రతా సంస్థల అప్రమత్తత వల్ల వారి ప్లాన్ విఫలమైంది. దాంతో వారు తిరిగి పంజాబ్ చేరుకున్నారు.

2 లో

# డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు

- ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచన
- రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- జాబ్ క్యాలెండర్ ప్రకారమే డీఎస్సీ హామీ
- అక్టోబర్‌లో నోటిఫికేషన్ విడుదలకు సన్నాహాలు
- డిసెంబర్‌లో పరీక్షల నిర్వహణకు చర్యలు
- 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విజయవంతం
- ఉపాధ్యాయ నియామకాలపై ప్రభుత్వం కట్టుబాటు

2 లో

# మహేష్ వ్యాఖ్యలపై హరీష్ న్యాయపోరాటం

- మహేష్‌కు లీగల్ నోటీసులు
- హరీశ్ రావు చర్యలు
- వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి
- బహిరంగ క్షమాపణ డిమాండ్
- కోర్టు చర్యల వార్నింగ్
- క్షుద్రపూజల వ్యాఖ్యల వివాదం



2 లో

# జేపీఎస్‌సీ వివాదంపై సీఎం హామీ

- దీక్షను విరమించిన దేవేంద్ర నాథ్ మహతో
- సోనమ్ వాంగ్‌చుక్ సూచనతో నిర్ణయం
- పేపర్ లీక్, అక్రమాలపై విద్యార్థుల ఆందోళన కొనసాగింపు
- ప్రిలిమినరీ పరీక్ష రద్దు చేయాలని డిమాండ్
- సీబీఐ, స్వతంత్ర కమిటీతో విచారణ కోరిన నిరసనకారులు
- దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని సీఎం హామీ
- జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీలో సంస్కరణలు చేపట్టాలని విజ్ఞప్తి

2 లో

# 3,000 కోట్ల కుంభకోణం

- మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు.. నేరుగా సోదాలు
- హైదరాబాద్, విశాఖలో ఐదు ప్రాంతాల్లో తనిఖీలు
- రూ.3,000 కోట్ల ఆర్థిక అక్రమాలపై దర్యాప్తు
- డిపాజిటర్ల నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- కీలక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, హార్డ్‌డిస్క్‌ల పరిశీలన
- బీహార్ ఈడీ బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోదాలు

2 లో

# డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ప్రారంభమైన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభ్యర్థులకు ట్విట్టర్ వేదికగా బెస్ట్ విషెస్ తెలియజేశారు. అభ్యర్థులందరూ ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతున్న టెట్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

జాబ్ క్యాలెండర్ ప్రకారమే డీఎస్సీ..

అయితే, ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ మేరకే తదుపరి డీఎస్సీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తదుపరి డీఎస్సీకి సంబంధించి అక్టోబర్‌లో నోటిఫికేషన్ వెలువడనుండగా, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ వేగంగా చర్యలు చేపడుతోంది. కాగా, ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ పోస్టులతో కూడిన 'మెగా డీఎస్సీ' ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని నారా లోకేష్ ప్రస్తావించారు.

# హైడ్రాలో ఫోర్జరీ కలకలం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** హైదరాబాద్ మహానగరంలో అత్యంత శక్తివంతమైన ఏజెన్సీగా మారిన హైడ్రా పేరుతో భారీ అక్రమాలు వెలుగులోకి రావడం కలకలం రేపింది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సహా ఉన్నతాధికారుల సంతకాలను ఓ ముఠాగా ఏర్పడి ఫోర్జరీ చేసినట్లుగా తేలింది. ఏకంగా 8 ప్రముఖ ప్రైవేటు కళాశాలలు ఈ ఫోర్జరీ సంతకాలు, నకిలీ ఎన్‌ఓసీల ఆధారంగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించడం అధికారులను ఒక్కసారిగా షాకింగ్‌కు గురిచేసింది.


నకిలీ ఫైర్ ఎన్‌వోసీల సృష్టి

అయితే, 'హైడ్రా' నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే, కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌వోసీ సర్టిఫికెట్లను తయారు చేశారు. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. నకిలీ ఎన్‌ఓసీ పత్రాలనే ఇంటర్మీడియట్ విద్యారంగంలో అఫిలియేషన్ పొందేందుకు సదరు 8 ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించాయి. ఈ క్రమంలోనే ఎన్‌వోసీ పరిశీలన సమయంలో సదరు సర్టిఫికెట్లు పూర్తిగా ఫేక్ అని.. వాటిపై ఉన్న కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయబడిందని 'హైడ్రా', ఇంటర్ బోర్డు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ మొత్తం వ్యవహారంపై 'హైడ్రా' యంత్రాంగం అలర్ట్ అయి కఠిన చర్యలకు పూనుకుంది. ఫోర్జరీకి పాల్పడిన మొత్తం 8 ప్రైవేటు కాలేజీల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హైడ్రా అడిషనల్ డైరెక్టర్లే లేక్ పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదును అందజేశారు.

ఫోర్జరీకి పాల్పడిన కాలేజీల జాబితా ఇదే..

1. హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర.
2. రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్.
3. ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం.
4. మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్.
5. శ్రీ చైతన్య జూనియర్, చంద్రాయణగుట్ట.
6. న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి.
7. షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి.
8. వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

# లోన్‌దారులకు ఆర్‌బీఐ గుడ్‌న్యూస్



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** దేశంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత రిజర్వ్ బ్యాంక్ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. ద్రవ్య పరపతి విధాన కమిటీ ద్వైమాసిక సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ప్రామాణిక వడ్డీ రేటైన రెపో రేటును 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచాలని గవర్నర్ నేతృత్వంలోని ఎంపీసీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.

ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచకపోవడంతో హోమ్ లోన్లు, ఆటో లోన్లు, పర్సనల్ లోన్లు తీసుకున్న వారి నెలవారీ ఈఎంఐలు పెరిగే అవకాశం లేదు. భవిష్యత్ పరిస్థితులు, ధరల స్థిరత్వాన్ని బట్టి నిర్ణయం తీసుకునేలా ఆర్‌బీఐ తన విధాన వైఖరిని న్యూట్రల్ గానే పునరుద్ఘాటించింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల హెచ్చుతగ్గుల మధ్య దేశీయ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు.

# జేపీఎస్‌సీ వివాదంపై సీఎం హామీ




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** ఝార్ఖండ్‌లో జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలపై కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. ఈ క్రమంలో ఆగస్టు 2 నుంచి రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో తాజాగా దీక్ష విరమించారు.

అంతకుముందు పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దీక్షను విరమించాలని సూచించారు. ఆయన హామీతో మహతో ముందుగా నీరు, ఉప్పు స్వీకరించి ఆందోళన కొనసాగించగా, అనంతరం దీక్షను ముగించారు. వాంగ్‌చుక్ మద్దతుతో నిరసనకారుల్లో ఉత్సాహం పెరిగిందని, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనను మాత్రం విరమించేది లేదని మహతో స్పష్టం చేశారు.

జూలై 5న ప్రకటించిన 14వ జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయడం, జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీలో సంస్కరణలు చేపట్టడం, నియామక అవకతవకలపై సీబీఐ లేదా రాష్ట్రానికి వెలుపలి హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ జరపాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, దర్యాప్తు పూర్తయ్యాక తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హామీ ఇచ్చారు.

# 3,000 కోట్ల కుంభకోణం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** వైసీపీ కీలక నేత, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఊహించని షాకిచ్చింది. ఈ మేరకు బుధవారం తెల్లవారుజాము నుంచి ఆయన నివాసాలు, కార్యాలయాలపై ఈడీ టీమ్స్ మెరుపు దాడులకు దిగాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన ఈడీ అధికారుల బృందం హైదరాబాద్, విశాఖపట్నంలోని ఐదు విభిన్న ప్రాంతాల్లో ఒకేసారి సోదాలు చేపట్టడం తీవ్ర కలకలం రేపింది. మళ్ల విజయప్రసాద్ వెల్ఫేర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆర్థిక అవకతవకలు, డిపాజిట్ల సేకరణలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈ దాడులు జరిగాయి. డిపాజిటర్ల నుంచి పెద్ద ఎత్తున నిధులు సేకరించి, నిబంధనలకు విరుద్ధంగా మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. దాదాపు రూ.3,000 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. విజయ ప్రసాద్ నివాసాలతో పాటు కంపెనీ కార్యాలయాల్లోని కీలక పత్రాలు, బ్యాంక్ ఖాతాలు, హార్డ్‌డిస్క్‌లు, డిజిటల్ సాక్ష్యాలను అధికారులు ఒక్కొక్కటిగా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

# హింసాత్మక చర్యలొద్దు సుప్రీంకోర్టు కీలక సూచన

**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** శాంతియుత నిరసనలు తెలిపే యువ విద్యార్థుల పట్ల అధికారులు, భద్రతా దళాలు అత్యంత సంయమనం పాటించాలని సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. హింసను అదుపు చేసేందుకు బలగాల ద్వారా హింసాత్మకంగా ప్రతిస్పందించడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయపడింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించిన నిరసనల సమయంలో చోటుచేసుకున్న రాళ్లదాడి, హింసాత్మక ఘటనలపై చర్యలు తీసుకోవాలని దాఖలైన పిటిషన్‌ను విచారిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా మార్చ్‌లు చేసే



యువత పట్ల భద్రతా దళాలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, వారిని రెచ్చగొట్టి హింస వైపు మళ్లకుండా చూడాలని సీజేఐ సూర్య కాంత్ స్పష్టం చేశారు.

వారి అభ్యర్థలను వినండి మొదలు..

అయితే, ఆందోళ చేస్తున్న యువత ఎందుకు ఆందోళన చేస్తున్నారు? వారు ఏమి చెబుతున్నారో వినడమే అత్యంత శక్తివంతమైన పరిష్కారామని సుప్రీం ధర్మాసనం కామెంట్ చేసింది. తాము చెబితే వినాలని, పరిస్థితులను ఎలా అదుపు చేయాలో న్యాయ పరిరక్షణ సంస్థలకు బాగా తెలుసని, వారి విచక్షణకే ఈ వ్యవహారాన్ని వదిలేస్తున్నామని కోర్టు కామెంట్ చేసింది. అదేవిధంగా రాజధాని ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో విద్యార్థుల నిరసనల హింసపై పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో అన్ని అంశాన్ని కలిపి విచారిస్తామని, కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకుంటామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# మహేష్ వ్యాఖ్యలపై హరీష్ న్యాయపోరాటం



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు లీగల్ నోటీసులు పంపారు. తెలంగాణ రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడకుండా అడ్డుకునేందుకే హరీశ్ రావు పలు ఆలయాలను సందర్శించి క్షుద్రపూజలు, చేతబడులు చేశారంటూ ఇటీవల మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన సంచలన వ్యాఖ్యలపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించారు. మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమైనవి, నిరాధారమైనవి మరియు సమాజంలో తనకున్న వ్యక్తిగత ప్రతిష్ఠను, రాజకీయ పరువును తీవ్రంగా భంగపరిచేలా ఉన్నాయని హరీశ్ రావు తరఫు న్యాయవాది పంపిన లీగల్ నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రత్యర్థులపై రాజకీయ ప్రయోజనాల కోసం, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఇటువంటి దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేశారని, తనపై చేసిన తప్పుడు ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ నోటీసుల ద్వారా డిమాండ్ చేశారు.

తెలంగాణ రాజకీయాల్లో ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల స్థాయిని పూర్తిగా దిగజార్చేలా కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు ఉన్నాయని లీగల్ నోటీసుల్లో విమర్శించారు. ఒక ప్రజాప్రతినిధిగా, నిత్యం దైవచింతనతో ఆలయాలను సందర్శించడాన్ని వక్రీకరించి, దానికి క్షుద్రపూజల రంగు పులిమి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇదే తరహాలో తనపై అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేసినందుకు గానూ ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు అద్దంకి దయాకర్, సామ రామ్మోహన్ రెడ్డిలకు కూడా లీగల్ నోటీసులు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా నోటీసుల్లో ప్రస్తావించారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ఒక నాయకుడి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా అసత్య ఆరోపణలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అందువల్ల మహేష్ కుమార్ గౌడ్ తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుంటూ స్పష్టమైన ప్రకటన విడుదల చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో సివిల్ మరియు క్రిమినల్ పరువు నష్టం చట్టాల కింద తదుపరి కోర్టు చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# జంతర్ మంతర్ నిరసనల్లో టెర్రరిస్టులు

మొదటి పేజీ తరువాయి

ఈ రెండు ముఠాల్లో మొదటి దానికి సంబంధించి రాజస్థాన్‌కి చెందిన సుఖ్‌మన్ సింగ్‌తో పాటు ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నాలుగు బాటిల్ బాంబులు, రెండు పిస్టళ్లు, తొమ్మిది కాట్రిడ్జ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిరంతరం సంబంధంలో ఉన్న సుఖ్‌మన్, పంజాబ్‌లోని పోలీస్ భవనాలు, పోలీసుల కదలికలపై నిఘా ఉంచేందుకు రెక్కీ నిర్వహించినట్లు ఒప్పుకున్నాడు. ఇక రెండో ముఠా రైల్వే ట్రాక్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ దృశ్యాలను పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు పంపుతున్నట్లు గుర్తించారు. జోడా ఫాటక్ సమీపంలో రైల్వే ట్రాక్ స్తంభానికి కెమెరా అమర్చిన ఘటనలో మోహకంపూరాకు చెందిన వంశీ కుమార్‌తో పాటు ఓ మైనర్‌ను అరెస్ట్ చేసి పిస్టల్, కెమెరాలు, దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సున్నితమైన మిలిటరీ ప్రాంతాల సమాచారాన్ని విదేశాలకు చేరవేస్తున్నారనే కోణంలో జీఆర్పీ కూడా వీరిని విచారిస్తోంది.

ఈ కుట్ర వెనుక ఉన్న మిగతా లింకులను దర్యాప్తు చేస్తూ పోలీసులు అనమోల్ సింగ్ అనే వ్యక్తితో పాటు, ఆయుధాల చట్టం కింద ఇదివరకే జైలులో ఉన్న సుఖ్‌దేవ్ సింగ్, హర్మాన్ సింగ్‌లను కూడా ప్రొడక్షన్ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో 19 ఏళ్ల వంశీ కుమార్, 24 ఏళ్ల హర్మాన్ సింగ్ (టీ షాప్ వర్కర్), 30 ఏళ్ల సుఖ్‌దేవ్ సింగ్ (డ్రైవర్), 20 ఏళ్ల అన్మోల్ సింగ్, 19 ఏళ్ల సుఖ్‌మన్ సింగ్ (ట్రాక్టర్ డ్రైవర్)లతో పాటు నలుగురు మైనర్లు ఉన్నారు. ఆర్థికంగా వెనుకబడి, చదువు మధ్యలోనే ఆపేసిన ఈ మైనర్లకు చిన్న చిన్న ఆశలు చూపి, పెట్రోల్ బాంబులు తయారు చేయడం నేర్పించి దేశవ్యతిరేక కార్యకలాపాల్లోకి దించినట్లు అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్ ప్రీత్ సింగ్ భుల్లార్ వెల్లడించారు. విదేశీ ఫండింగ్, స్థానిక సహకారం, ఆయుధాల సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోవడానికి దర్యాప్తు తీవ్రతరం చేశారు.



# కస్తూర్బా గాంధీ టీచర్లపై సస్పెన్షన్ వేటు!



**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** పిల్లలకు ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు దారితప్పారు. ఏకంగా విద్యార్థినులతోనే వ్యక్తిగత పనులు, మసాజ్‌లు చేయించుకుని అడ్డంగా బుక్కయ్యారు. ఈ ఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం, నంబులపూలకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పాఠశాలలో పనిచేస్తున్న హిందీ టీచర్ రూపా రాణి.. ఇద్దరు విద్యార్థినులతో తన తలకు కొబ్బరి నూనె రాయించుకుని మసాజ్ చేయించుకున్నారు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న కొందరు రహస్యంగా ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అవి కాస్తా రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపాయి.

తల్లిదండ్రుల ఆగ్రహం.. అధికారుల చర్యలు : ఈ ఫోటోలు వైరల్ కావడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన గురువులు పిల్లలతో ఇలాంటి పనులు చేయించుకోవడంపై మండిపడ్డారు. ఘటనపై వెంటనే స్పందించిన విద్యాశాఖ ఉన్నతాధికారులు.. ప్రాథమిక విచారణకు ఆదేశించారు. వాస్తవాలను నిర్ధారించుకున్న అనంతరం బాధ్యులైన హిందీ టీచర్ రూపారాణితో పాటు, ప్రిన్సిపల్ రెహానాను విధుల నుంచి తొలగిస్తూ సస్పెన్షన్ వేటు వేశారు.

# ఏపీ ఎజెండా.. తెలంగాణ ఆందోళన

మొదటి పేజీ తరువాయి

'గురుదక్షిణ' చెల్లించేందుకేనా ఈ మౌనం?:

తెలంగాణ ప్రాజెక్టును వ్యతిరేకించలేదని అంటూనే తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాశారని చంద్రబాబు మాటలు నిజమా లేక లేఖలు నిజమా అని హరీశ్ రావు ప్రశ్నించారు. చంద్రబాబు మాటలకు, చేతలకు పొంతన లేదని, పక్క రాష్ట్రం కుట్రలు పన్నుతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. గురుదక్షిణ చెల్లించడం కోసమే మౌనంగా ఉన్నారా అని నిలదీశారు. తెలంగాణ ప్రయోజనాలు సమాధి కట్టేవిధంగా ఏపీ కుట్రలు చేస్తోందని. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ గొంతుకోయాలని చూస్తున్నారని ఆరోపించారు.


బీజేపీ స్పందించాలి:

గోదావరిపై కేసీఆర్ ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తేస్తే వాటిని రద్దు చేయాలని ఏపీ డిమాండ్ చేస్తోందని, భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారి తెలంగాణకు ఇచ్చిన ఏడు ప్రాజెక్టుల అనుమతులపై రివ్యూ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే వాటిని జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చిందన్నారు. అంటే కుక్క తోకను ఆడిస్తోందా లేక తోక కుక్కను ఆడిస్తోందా? కేంద్ర ప్రభుత్వం పెద్దదా లేక జీఆర్ఎంబీ పెద్దదా అని నిలదీశారు. అజెండా సెట్ చేసే ధైర్యం ఏపీకి, జీఆర్ఎంబీకి ఎక్కడిది అన్నారు. దీనిపై బీజేపీ ఆలోచించాలన్నారు. చంద్రబాబుకు భయపడి బీజేపీ స్పందించకుంటే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించాలని డిమాండ్ చేశారు.

రద్దు అంటే రాష్ట్రానికి అన్యాయమే:

కాళేశ్వరం అనుమతులు రద్దు అంటే సగం తెలంగాణకు అన్యాయం చేయడమేనని, సీతారామ అడ్డుకోవడమంటే ఖమ్మం జిల్లాకు అన్యాయం చేయడమేనన్నారు. తెలంగాణలో తాగు, సాగునీరు దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని చెప్పడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. కాంగ్రెస్ పాలనలో కృష్ణా జలాలను కూడా సరిగా వాడటం లేదని, గోదావరిపై ఉన్న నీళ్లను ఎత్తిపోయడం లేదని విమర్శించారు.

# డయల్ 100 స్థానంలో కొత్త ఎమర్జెన్సీ నంబర్.. 112 ప్రారంభించిన డీజీపీ




**న్యూస్ డెస్క్, 05 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలో ఇకపై అన్ని ఎమర్జెన్సీ సేవలకు ఒకే నంబర్ ఉపయోగంలోకి వచ్చింది. డయల్ 100 స్థానంలో కొత్తగా నంబర్ ను పోలీస్ శాఖ తీసుకువచ్చింది. అంబులెన్స్, పోలీస్, అగ్నిమాపక, ఇతర సర్వీసుల కోసం ఇకపై డయల్ 112 నంబర్?ను తీసుకువచ్చింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ లో డీజీపీ సీవీ ఆనంద్ ఈ నూతన ఎమర్జెన్సీ కాల్ సెంటర్ ను ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు వేర్వేరు సేవలకు వేరు నంబర్లతో ఉన్న సేవలను ఇకపై ఒకే గొడుకు కిందకు రానున్నాయి. రోడ్డు ప్రమాదాలు, గొడవలు, దోపిడీలు, వేధింపులు వంటి అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 కు కాల్ చేస్తే వెంటనే సహాయం లభిస్తుందని డీజీపీ తెలిపారు.

24/7 అందుబాటులో:

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కాల్ మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేశామని డయల్ 112కు కాల్ వచ్చిన వెంటనే సమాచారం సమీప పోలీస్ స్టేషన్ కు చేరవేస్తారని డీజీపీ చెప్పారు. కొత్త ఎమర్జెన్సీ నంబర్ 24 గంటలు, 365 రోజులు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ కాల్ రాగానే కాలర్ లొకేషన్ గుర్తించి దగ్గర్లోని పోలీస్, ఫైర్ రెస్పాన్స్ టీమ్ లకు సమాచారం చేరుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ ను మరింతగా తెలంగాణ పోలీసు ఉపోయగించుకోబోతోందన్నారు.

# భాస్కర్ మృతి కళారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి

**తెలుగు గళం న్యూస్ జనగామ ఆగస్టు 05**

జనగామకు చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు, అభ్యుదయ భావవాది కవి, రచయిత, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు పొట్టబత్తిని భాస్కర్ ఆకస్మిక మరణం కళారంగానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి పేర్కొన్నారు.భాస్కర్ పార్థివ దేహానికి సీపీఎం నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.జనగామ పట్టణానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు, అభ్యుదయ భావవాది కవి, రచయిత, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు పొట్టబత్తిని భాస్కర్ గుండెపోటుతో హనుమకొండలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం జనగామ శివారులోని శ్రీనివాస కాలనీలో ఆయన పార్థివ దేహాన్ని సీపీఎం జిల్లా ప్రతినిధి బృందం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి మాట్లాడుతూ, భాస్కర్ తండ్రి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ పాండురంగం నుంచి కమ్యూనిస్టు భావజాలాన్ని, క్రమశిక్షణను అలవర్చుకున్నారని తెలిపారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఉపాధ్యాయుడిగా స్థిరపడిన ఆయన, ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక స్పృహతో రచయితల ఉద్యమంలోనూ చురుకుగా పనిచేశారని చెప్పారు.జనగామ రచయితల సంఘం అధ్యక్షుడిగా సేవలందించిన భాస్కర్ సమకాలీన అంశాలపై రచనలు చేస్తూ ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచారని, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో నిబద్ధత కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారని బూడిది గోపి పేర్కొన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, సాహిత్య రంగానికి, ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజయేందర్ తదితరులు పాల్గొన్నారు



# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి-సారయ్య

• 50 కిలోల బియ్యం అందజేత



**స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 5 (తెలుగు గళం)**

స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి--సారయ్య ఆధ్వర్యంలో బోసు ఐలయ్య కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు.ఇటీవల బోసు ఐలయ్య మృతిచెందడంతో ఆయన నివాసానికి వెళ్లిన నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా ఐలయ్య కుటుంబానికి అండగా నిలిచే ఉద్దేశంతో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. బోసు ఐలయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు పెసరు కృష్ణవేణి--సారయ్య, గట్టు సురేందర్, కొంగరి రమేష్, ఏలియా, రవితేజ, శేఖర్, స్వామి, బాలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి-సిపిఎం

## ఖాళీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి డిమాండ్



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఆగస్టు 05**

స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేసింది.ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు కాంపౌండ్ వాల్ నిర్మాణం, క్రీడా మైదానం అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంది. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, పి.ఈ.టి ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ తెలిపారు. ముఖ్యమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని, ప్రభుత్వం వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని, పాఠశాల ఆవరణలో పందులు, మేకలు సంచరించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. క్రీడా మైదానం సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు శారీరక వ్యాయామం, క్రీడల్లో పాల్గొనే అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న మునిగెల రమేష్, వెంటనే ఉపాధ్యాయులను నియమించి, కాంపౌండ్ వాల్ నిర్మించి, క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి క్రీడా సామగ్రిని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, అవసరమైతే విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేస్తామని సిపిఎం మండల కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, చిలుముల్ల భాస్కర్ పాల్గొన్నారు.

# రంగాపురం గ్రామ గౌడ సంఘం అధ్యక్షునిగ గిరిగాని వీరభద్రం గౌడ్

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈరోజు మన గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగినది. గ్రామ కమిటీ అధ్యక్షులుగా గిరగాని వీరభద్రం గౌడ్,ఉపాధ్యక్షులుగా చేగోని లక్ష్మీనారాయణ,కార్యదర్శిగా బొమ్మన శేఖర్ను ఎన్నుకున్నారు,ఈ సందర్భంగా అధ్యక్షులు వీరభద్రం గౌడ్ మాట్లాడుతూ సంఘంలో ఐక్యత పెరిగితే సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది అన్నారు,యువతను నాయకత్వంలో భాగస్వామ్యం చేయడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, అవసరమైన వారికి అండగా నిలవడం ద్వారా సంఘం మరింత బలోపేతం అవుతుంది అన్నారు,నా ఎన్నిక కు సహకరించిన గ్రామ పెద్దలకు అందరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో రావుల యాకన్న,వేముల నవీన్,మొగాలాగాని ఏకాంబరం,గిరగానీ సురేష్, మొగలిగాని వెంకన్న, గిరగాని సుధీర్,సభ్యులుగా చేగోని సుధాకర్,బొల్లపల్లి బిక్షపతి,రేసు అయిలయ్య, గిరగానీ పెద్ద మల్లేశం, గిరగాని సంపత్,బలగాని ఉపేందర్,కందునూరి లింగయ్య,గిరగాని చిన్న మల్లేశం,వేముల పాపయ్య,రేసు వెంకన్న,కందునూరి మహేష్ తదితర గ్రామ గౌడ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

# పేరుకే మున్సిపాలిటీ

## వర్షం పడిందంటే రోడ్డు చిత్తడి చిత్తడి

## పాఠశాలకు వెళ్లేదేలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్న చిన్నారులు



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

రోడ్డు సౌకర్యం లేక ప్రతిరోజూ బురదలోనే పాఠశాలకు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.వర్షం పడితే రోడ్లు పూర్తిగా బురదమయంగా మారడంతో విద్యార్థులు, వృద్ధులు,మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,పేరుకే మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ తండాలో ఇప్పటికీ సరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధిలైట్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, కింది స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని వారు అంటున్నారు.మా గిరిజన బంజారా పిల్లల గోడు వినండి. మా తండాలోని సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు వంటి మౌలిక వసతులను వెంటనే కల్పించేలా చర్యలు తీసుకోవాలి” అని తండా ప్రజలు విజ్ఞప్తి చేశారు.తండా అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు

వెళ్లాల్సిన దుస్థితి పేరుకే మున్సిపాలిటీ..కనీస రోడ్లు, డ్రైనేజీ,వీధిలైట్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్న చిన్నారులు మరిపెడ మున్సిపాలిటీ 5వ వార్డు బోడ అమృత్ నాయక్ తండా ప్రజల గోడు,మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు బోడ అమృత్ నాయక్ తండాలో మౌలిక వసతుల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ముఖ్యంగా చిన్నారులు ప్రతిరోజూ బురద రోడ్లలో

# రేషన్ బియ్యం అక్రమ రవాణా భగ్నం.. లారీ స్వాధీనం”



**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 05(తెలుగుగళం) న్యూస్:**

సత్తుపల్లి పట్టణంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో భారీ మొత్తంలో రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ లారీని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించిన పోలీసులు లారీతో పాటు అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారంలో ఇంకెవరు ఉన్నారనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం ఉన్న ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# మాజీ పాత్రికేయుడు అజీజ్ కుటుంబాన్ని పరామర్శించిన పాత్రికేయుల బృందం



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఎండి. అబ్దుల్ ఖాదర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో,ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పాత్రికేయుల బృందం పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది.దశాబ్దకాలం పాటు పాత్రికేయ వృత్తిలో సేవలందించి,ప్రస్తుతం డోర్నకల్ మండలం చిలుకోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాజీ పాత్రికేయుడు ఎం.డి.అబ్దుల్ అజీజ్,అలాగే సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అబ్దుల్ రషీద్‌లను వారి నివాసంలో కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ,అబ్దుల్ ఖాదర్ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది, సామాజిక స్పృహ కలిగిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా అందరి మన్ననలు పొందారని కొనియాడారు.ఆయన విలువలు,సేవాభావం కుమారులలో ప్రతిఫలించడం వారి పెంపకానికి నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం దివంగత అబ్దుల్ ఖాదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సత్తార్ పాషా,రియాజ్,అక్తర్ పాషా,వేణు,అనంతరాములు,రాజేష్,సంజీవ్,నాగేంద్ర,విష్ణు,సీఐటీయూ మండల కన్వీనర్ దుండి వీరన్న,నాయకులు కొండ వెంకన్న,భూష్పాక మైసయ్య,గోపి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి, సాంప్రదాయాల నడుమ ఆర్యవైశ్య మహిళల వనభోజనాలు

## రామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

## గోరింటాకు వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి

**తెలుగు గళం, నిజామాబాద్ జిల్లా:** పిట్లం మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వనభోజనాలు భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి. గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముందుగా పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుని సాంప్రదాయాన్ని చాటుతూ ఆనందంగా గడిపారు. వనభోజనాలతో పాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మహిళలను ఆకట్టుకున్నాయి. భక్తి, సాంప్రదాయాలు, ఆత్మీయత కలబోసిన ఈ కార్యక్రమం ఆర్యవైశ్య మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది. అందరం వైభవంగా నిర్వహించారు.




# మార్దండ పాఠశాలకు లయన్స్ క్లబ్ నుంచి 10 బెంచీల విరాళం




**తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా :** మార్దండ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 10 బెంచీలను విరాళంగా అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ట్రెజరర్ బాలు, జోన్ చైర్మన్ నారాయణ, జిల్లా చైర్మన్లు సంజీవరెడ్డి, రాజేంద్ర ప్రసాద్, కిషన్, చంద్రశేఖర్, ధన్నరపు సంతోష్, అశోక్ గౌడ్, గ్రామ సర్పంచ్ సాయిలు, గ్రామ కార్యదర్శి రాములు, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు రమేష్, దివ్య, మాజీ సర్పంచ్ రామకృష్ణ, సాయిలు పటేల్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రఖ్యాత చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి భుజంగం కన్నుమూత

**తెలంగాణ చిందు కళారంగానికి తీరని లోటు**

**--కళాకారులు,కుటుంబ సభ్యుల ఆవేదన**



**తెలుగు గళం ఐనవోలు ఆగస్టు 5**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐనవోలు మండలం పంతిని గ్రామానికి చెందిన ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గజవెల్లి భుజంగం అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు.ఆయన మృతి తెలంగాణ చిందు కళారంగానికి, యక్షగాన నాటక ప్రియులకు, చిందు కుల సంఘానికి తీరని లోటని పలువురు కళాకారులు, కుటుంబ సభ్యులు భావోద్వేగంతో నివాళులర్పించారు.గజవెల్లి భుజంగం గత 50 సంవత్సరాలుగా చిందు యక్షగాన కళను తన జీవనాధారంగా చేసుకొని, అనేక పౌరాణిక నాటకాలలో అద్భుతమైన పాత్రలు పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.రామాయణం, మహాభారతం, భాగవతం వంటి యక్షగాన ప్రదర్శనల్లో భీముడు, అర్జునుడు, శ్రీకృష్ణుడు, నారదుడు, మహర్షి, ధర్మరాజు తదితర పాత్రలను సజీవంగా పోషించి తన నటన, గానం ద్వారా ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవారని సహచర కళాకారులు గుర్తుచేశారు.వారసత్వంగా తాతలు, తండ్రుల నుంచి వచ్చిన చిందు యక్షగాన కళను భుజంగం ఎంతో నిబద్ధతతో కొనసాగించారని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర చిందు యక్షగాన కుల సంఘానికి సుమారు మూడు దశాబ్దాలుగా సర్పంచ్‌గా (సంఘ నాయకుడిగా) సేవలందిస్తూ కళాకారుల సంక్షేమం కోసం కృషి చేశారని పేర్కొన్నారు.భుజంగం మృతి తమ కుటుంబానికే కాకుండా యావత్ చిందు కళాకారుల కుటుంబాలకు తీరని లోటని ఆయన కుమారులు, చిందు కళాకారులైన గజవెల్లి శ్రీశైలం, అమరేందర్, రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.భుజంగం అంతిమయాత్రలో ఆయన కుమార్తెలు, అల్లుళ్లు వసుమతి--కేదారి, జమున--చిరంజీవి, టీవీ కళాకారుడు రాజమౌళి, వేదాంతం, సిద్ధూ, భాస్కర్, వెంకన్న, రవి, కుమార్, స్వామి, బంధువులు, చిందు కుల సంఘ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు.

# ఎస్సార్ యూనివర్సిటీలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం

**'సురక్షా కా తిరంగా -- ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' ప్రచారంలో భాగంగా నిర్వహణ**



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఆగస్టు 05**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సార్ యూనివర్సిటీలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "సురక్షా కా తిరంగా" మరియు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ మోసాలను అరికట్టడం, ముఖ్యంగా విద్యార్థుల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచడం లక్ష్యంగా హసన్‌పర్తి పోలీసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌తో పాటు ఎస్సార్ యూనివర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి. మహేష్, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ ఎ.వి.వి. సుధాకర్, ఉప రిజిస్ట్రార్ బి. శరత్ కుమార్, సైబర్ భద్రత సమన్వయకర్త ఎం. సంపత్ కుమార్, క్రమశిక్షణ విభాగం డీన్ లెఫ్టినెంట్ ఎ. రాజేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు సైబర్ నేరాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే, ముఖ్యంగా తొలి గంటలో ఫిర్యాదు చేస్తే, పోగొట్టుకున్న డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.అలాగే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అధికారిక సైబర్ నేరాల ఫిర్యాదు వెబ్‌సైట్ ద్వారా కూడా బాధితులు ఎప్పుడైనా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని వివరించారు.ప్రజలకు పలు కీలక సూచనలు చేస్తూ, గుర్తు తెలియని లింకులను తెరవవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పే మోసపూరిత యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో హసన్‌పర్తి పోలీసులు, ఎస్సార్ యూనివర్సిటీ ప్రతినిధులు కలిసి సైబర్ భద్రతపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు.



# బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు**





**తెలుగు గళం న్యూస్ వరంగల్/తొర్రూరు, ఆగస్టు 5**

బోనాల పండుగ సందర్భంగా తొర్రూరు పట్టణంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని అమ్మవారిని ప్రార్థించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని, పాలకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ, బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, మహిళా సంక్షేమం, యువత ఉపాధి, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ పాలకుర్తి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, డా. సోమేశ్వర్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేటి నుంచి యాప్ ద్వారానే

# రాయితీ ఎరువుల బుకింగ్"




సత్తుపల్లి/వేంసూరు, ఆగస్టు05(తెలుగుగళం) న్యూస్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో ఆగస్టు 6 వ తేదీ గురువారం నుండి అనగా నేటి నుంచి రాయితీ ఎరువుల కొనుగోలు ప్రక్రియను ప్రత్యేక మొబైల్ అనువర్తనం ద్వారా అమలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి పచ్చల రామ్మోహన్ బుధవారం మీడియాకు తెలిపారు.



రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎఫ్ఎఫ్ఎస్ (ఎరువుల విక్రయ నిర్వహణ) అనువర్తనాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్ సంఖ్యతో ప్రవేశించి పంటల వివరాలు నమోదు చేయాలి. అనంతరం అవసరమైన యూరియా, డీఏపీ, మిశ్రమ ఎరువులు, పొటాష్, సూపర్ ఎరువులను ముందస్తుగా నమోదు చేసుకుని, ప్రైవేటు ఎరువుల విక్రయ కేంద్రాలు, గ్రోమోర్ కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.అనువర్తన వినియోగంపై సందేహాలుంటే వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారి, సహకార సంఘాల సిబ్బంది లేదా ప్రైవేటు ఎరువుల విక్రేతలను సంప్రదించాలని ఆయన సూచించారు.

# జనగామ జిల్లాలో 12 అడుగుల కొండచిలువ కలకలం

**మహిళపై దాడి--ప్రాణాపాయం నుంచి బయటపడిన బాధితురాలు**



**తెలుగు గళం న్యూస్ జనగామ, ఆగస్టు 5**

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో భారీ కొండచిలువ దాడి కలకలం రేపింది.మొక్కజొన్న చేనులో వ్యవసాయ పనులు చేస్తున్న స్వప్న అనే మహిళపై సుమారు 12 అడుగుల పొడవున్న కొండచిలువ ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో ఆమె తీవ్ర భయాందోళనకు గురికాగా, కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.విశేషం ఏమిటంటే, బాధితురాలిపై దాడి చేసిన కొండచిలువను కూడా కుటుంబ సభ్యులు పట్టుకుని ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటన ఆస్పత్రి ప్రాంగణంలో కొంతసేపు ఉత్కంఠను రేకెత్తించింది.బాధితురాలికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి వైద్య సేవలు అందించారు.ప్రస్తుతం స్వప్న ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిందని, ఆమెకు అవసరమైన మెరుగైన చికిత్స అందిస్తున్నామని డాక్టర్ బిక్షపతి తెలిపారు.ఈ ఘటనతో కంచనపల్లి గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వ్యవసాయ క్షేత్రాల్లో పని చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

# ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కలిసిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వనం శ్రీనివాస్

**తెలుగు గళం న్యూస్ జనగామ/పాలకుర్తి ఆగస్టు 05**

పాలకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) మెడికల్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వనం శ్రీనివాస్ బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని డాక్టర్ వనం శ్రీనివాస్ తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి డాక్టర్ వనం శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.



## నీర్మాల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**తెలుగు గళం న్యూస్ జనగామ, ఆగస్టు 5**

జిల్లాలోని దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, చిన్నారుల సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా రెండో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ఏకరూప దుస్తులను కలెక్టర్ పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి పేర్లు, చదువుతున్న తరగతి, పాఠశాలకు హాజరు, ఉపాధ్యాయుల బోధన అర్థమవుతుందా, తెలుగు--ఇంగ్లీష్ చదవగలుగుతున్నారా, గణితంలో కూడికలు, తీసివేతలు చేయగలుగుతున్నారా వంటి అంశాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంపొందించేలా బోధన సాగించాలని, విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు.అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ చిన్నారుల ఆరోగ్యం, పోషకాహార పంపిణీ, హాజరు తదితర అంశాలను సమీక్షించారు.చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ ప్రతి చిన్నారి ఆరోగ్యం, ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ తనిఖీలో గ్రామ సర్పంచ్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.